క్లుప్తంగా

భవన నిర్మాణాల తనిఖీ



తల్లంపాడులో ఆర్బీకే పనులను తనిఖీ చేస్తున్న ఈఎన్‌సీ బాలునాయక్

దొరవారిసత్రం: మండలంలోని నెలబల్లి, తల్లంపాడు గ్రామాల్లో నిర్మాణంలో ఉన్న సచివాలయం, ఆర్బీకే, వైఎస్సార్ హెల్త్ సెంటర్ భవనాలను బుధవారం పంచాయతీ రాజ్ శాఖ ఈఎన్‌సీ బాలునాయక్ తనిఖీ చేశారు. భవన నిర్మాణాలు ఎలా సాగుతున్నాయనే విషయం తెలుసుకోవడంతోపాటు పనుల నాణ్యతను పరిశీలించారు. పనులు త్వరగా పూర్తి చేసేలా అధికారులు చొరవ తీసుకోవాలన్నారు. ఆయన వెంట ఎస్‌ఈ శంకర్‌నారాయణ, డీఈ రమణ, ఏఈ వెంకటేశ్వర్లు ఉన్నారు.

సచివాలయ భవనాల పరిశీలన

తడ: మండలంలో నిర్మిస్తున్న సచివాలయ, ఆర్బీకే కేంద్రాల భవనాలను పంచాయతీరాజ్ ఈఎన్‌సీ బాలునాయక్ గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిర్మాణాలో ఉన్న సచివాలయ, ఆర్బీకే కేంద్రాల భవనాలను త్వరితగతిన పూర్తి చేసి, అందుబాటులో తీసుకునిరావాలన్నారు. భవనాల నిర్మాణాలకు సంబంధించి ప్రభుత్వం నిధులు మంజూరు చేసేందుకు సిద్ధంగా ఉందన్నారు. ఆయన వెంట డీపీఆర్ ఈఓ శంకర్‌నారాయణ, ఈఈ గిరినాథ్ , డీఈ రవణయ్య, ఏఈ వెంకటేశ్వర్లు ఉన్నారు.

కార్యదర్శుల ఫీల్డ్ విజిట్



శ్రీరామచంద్రా ఎన్‌క్లేవ్‌ను పరిశీలిస్తున్న పంచాయతీ కార్యదర్శులు

పెళ్లకూరు: మండలంలోని తాళ్వాయిపాడులో ఉన్న శ్రీరామచంద్ర ఎన్‌క్లేవ్‌ను గురువారం పలువురు పంచాయతీ కార్యదర్శులు ఫీల్డ్ విజిట్ చేశారు. రీఫ్రెషర్ ట్రైనింగ్ ఆఫ్ పంచాయతీ సెక్రటరీస్‌లో భాగంగా పరిసర ప్రాంతాల్లో పూర్తి నిబంధనలతో ఏర్పాటు చేసిన శ్రీరామచంద్ర లేఅవుట్‌ను విజిట్ చేసి, అక్కడి వసతులను పరిశీలించారు. వెంచర్ ఏర్పాటులో గ్రామానికి కేటాయించాల్సిన పదిశాతం స్థలం, తాగునీరు, విద్యుత్ సౌకర్యం, విశాలమైన సిమెంట్‌రోడ్లు, వీధులకు ఇరువైపుల మొక్కల పెంపకం, వీధి దీపాలు, మురుగు కాలువలు, ఓవర్‌హెడ్ వాటర్ ట్యాంక్ తదితర వాటిని క్షుణ్ణంగా పరిశీలించారు. అలాగే జగనన్న భూహక్కు–భూరక్షపై గ్రామంలో పరిశీలన చేపట్టారు.

నూతన కార్యవర్గం



ఆర్‌అండ్‌బీ ఈఈ రామాంజనేయులను సత్కరిస్తున్న నూతన కార్యవర్గ సభ్యులు

గూడూరురూరల్: ఏపీ ఆర్‌అండ్‌బీ మినిస్టీరియల్ ఎంప్లాయీస్ అసోసియేషన్ నెల్లూరు జిల్లా నూతన కార్యవర్గం ఎన్నిక ఏకగ్రీవం అయ్యింది. జిల్లా అధ్యక్షుడిగా బెల్లంకొండ మస్తానయ్య, కార్యదర్శిగా ఎన్వీ సురేష్, అసోసియేట్ ప్రెసిడెంట్ పి.మధు, కోశాధికారి నవీన్, ఉపాధ్యక్షుడిగా నారాయణ రాజారావు తదితరులు ఎన్నికయ్యారు. ఈ మేరకు గురువారం వారు ఆర్‌అండ్‌బీ ఈఈ పి.రామాంజనేయులను కలిసి శాలువాతో సత్కరించారు.

రాష్ట్రస్థాయి త్రోబాల్ పోటీలకు ఆరూరు విద్యార్థినులు



త్రోబాల్ పోటీలకు ఎంపికైన విద్యార్థినులు

చిట్టమూరు: మండలంలోని ఆరూరు జెడ్పీ హైస్కూల్ విద్యార్థినులు రాష్ట్రస్థాయి త్రోబాల్ పోటీలకు ఎంపికైనట్లు ఆ పాఠశాల పీడీ సురేష్ గురువారం తెలిపారు. అండర్–14 విభాగంలో రూప, అండర్–17 విభాగంలో గౌరి జిల్లా స్థాయి త్రోబాల్ పోటీల్లో ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయికి అర్హత సాధించారన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు జ్యోతి, ఉపాధ్యాయులు చలపతి, అశోక్, రాజేంద్ర, పుష్పలత విద్యార్థులను అభినందించారు.

కుస్తీ పోటీల్లో బీసీ గురుకులం విద్యార్థి ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపల్

కోట: స్థానిక బీసీ గురుకుల పాఠశాల పదో తరగతి విద్యార్థి కె.గణేష్ రాష్ట్రస్థాయి కుస్తీ పోటీల్లో మొదటి స్థానం సాధించినట్లు ప్రిన్సిపల్ నారాయణ రావు గురువారం తెలిపారు. ఎన్టీఆర్ జిల్లా నున్నా గ్రామంలో ఈ నెల 21 నుంచి 23వ తేదీ వరకు జరిగిన పోటీల్లో 51 కిలోల విభాగంలో గణేష్ ప్రతిభ కనబరిచి జాతీయస్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. అలాగే తొమ్మిదో తరగతి విద్యార్థి ఉమేష్ 65 కిలోల విభాగంలో రెండో స్థానం సాధించినట్లు తెలిపారు. విద్యార్థులను ప్రిన్సిపల్, ఉపాధ్యాయులు, పీడీ ప్రసాద్, పీఈటీ నాగమణి అభినందించారు.

భూ హక్కు పత్రం..

రైతన్నకు భరోసా

వంశపారంపర్య భూమి.. ఏళ్లుగా సాగు..
అయినా ఆ పుడమిపై హక్కు పత్రాల లేమి..
వెరసి క్రయ, విక్రయాలకు నోచుకోని దైనం..
ఇబ్బందుల్లో ఆ నేల యజమాని..
ఈ దుస్థితి నుంచి అన్నదాతలను గట్టెక్కించాలని ప్రభుత్వం నిర్ణయించింది. జగనన్న శాశ్వత భూహక్కు–భూ రక్ష పథకం అమలు చేసింది. పక్కాగా పత్రాలు జారీ చేసింది. కర్షకులకు భరోసా నిచ్చింది.

- 116 మందికి పట్టాదారు పాసు పుస్తకాల అందజేత
- ఏళ్ల సమస్యకు పరిష్కారం



అద్దెపల్లిలో పట్టాదారు పాసు పుస్తకాలను అందిస్తున్న తహసీల్దార్, ఎంపీడీఓ

చిల్లకూరు: చిక్కుముడులు వీడి ఏన్నో ఏళ్లుగా పరిష్కారం కాని సమస్యకు నేడు రాష్ట్ర ప్రభుత్వం పరిష్కారం చూపుతూ రైతులకు పట్టాదారు పాస్ పుస్తకాలు అందజేయడంతో వారు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం వంద ఏళ్ల తరువాత భూములపై హక్కులు కల్పిస్తూ రీ సర్వే ప్రక్రియను ప్రారంభించి, కంప్యూటర్ డిజిటలేజేషన్ చేసిన పట్టాదారు పాస్ పుస్తకాలను అందిస్తోంది. ఇందు కోసం ప్రభుత్వం జగనన్న శాశ్వత భూహక్కు–భూ రక్ష పథకం అమలు చేసింది. ఈ పథకం కింద గ్రామాలు, పట్టాణాల్లోని భూముల రీ సర్వే ప్రక్రియ చేపట్టింది. ఇందులో భాగంగానే మండలంలోని పలు గ్రామాల్లో భూములను రీ సర్వే చేసి, హద్దులు చూపి, ఎలాంటి అభ్యంతరాలు లేకుండా ఉండేలా రెవెన్యూ అధికారులు రైతుల అభిప్రాయాలను సేకరించారు. ఎలాంటి అభ్యంతరాలు లేని భూములకు రెవెన్యూ అధికారులు పట్టాదారు పాస్ పుస్తకాలను అందజేస్తున్నారు. మండలంలోని అద్దెపల్లె రెవెన్యూ పరిధిలో సుమారు 800 ఎకరాల రీ సర్వే చేసి, గురువారం 116 మంది రైతులకు పట్టాదారు పాస్ పుస్తకాలు అందజేశారు. దీంతో లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

కార్యాలయాల చుట్టూ తిరిగి విసిగిపోయాం



గ్రామానికి సమీపంలోని 1.30 ఎకరాల భూమిని ఎన్నో ఏళ్లుగా సాగు చేసుకుంటున్నాను. దానికి హద్దులు చూపి, పట్టా ఇవ్వాలని ఎన్నో ఏళ్లుగా రెవెన్యూ కార్యాలయం చుట్టూ తిరిగి, తిరిగి విసిగి వేశారిపోయాం. అయితే సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన జగనన్న శాశ్వత భూహక్కు–భూ రక్ష పథకం కింద రీ సర్వే చేసి, నేరుగా ఇంటి వద్దనే పట్టాదారు పాస్ పుస్తకం ఇవ్వడం ఎంతో సంతోషంగా ఉంది.

-ఒగ్గు చినసుబ్బయ్య, అద్దెపల్లె, చిల్లకూరు మండలం

ఈ తరంలో చూస్తామనుకోలేదు



నా పేరు మీద గ్రామానికి సమీపంలో 1.35 ఎకరాల భూమి ఉంది. దీనికి హద్దులు చూపి, పట్టాదారు పాస్ పుస్తకం కోసం నా భర్త చిన్నయ్య చిల్లకూరులోని కార్యాలయానికి ఏళ్ల తరబడి తిరుగుతూనే ఉన్నాడు. అయితే సీఎం జగన్‌మోహన్‌రెడ్డి వచ్చిన తరువాత పేద రైతులకు పట్టాదారు పాస్ పుస్తకాలు ఇచ్చేందుకు శ్రీకారం చుట్టారు. మా తరంలో మా భూమికి హక్కు పత్రాలు వస్తాయనుకోలేదు. ప్రభుత్వం రీ సర్వే చేపట్టి, భూమి ఉన్న వారందరికీ పట్టాదారు పాస్ పుస్తకాలు ఇవ్వడం ఆనందంగా ఉంది.

- నాగరెడ్డి రమణమ్మ, అద్దెపల్లి, చిల్లకూరు మండలం

ప్రతి రైతుకూ కొత్త పాసుపుస్తకం



మండలంలో రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన జగనన్న శాశ్వత భూహక్కు–భూ రక్ష పథకం కింద మూడో విడత రీసర్వే చేపట్టి త్వరగా పూర్తి చేస్తేందుకు సిద్ధం అవుతున్నాం. ప్రస్తుతం తీర ప్రాంతంలోని అద్దెపల్లెలో జరిగిన రీ సర్వే పూర్తి కావడంతో పాటు 116 మంది లబ్ధిదారులకు పట్టాదారు పాస్ పుస్తకాలు అందిస్తున్నాం. ఇలానే ప్రతి రైతుకూ నూతన పాస్ పుస్తకాలు అందజేస్తాం.

- శ్రీనివాసులు, తహసీల్దార్, చిల్లకూరు మండలం

గొప్ప తత్వవేత్త మహ్మద్ ప్రవక్త



విద్యార్థినులకు దుస్తులు పంపిణీ చేస్తున్న ఆర్డీఓ

గూడూరురూరల్: విశ్వమానవాళికి దాతృత్వం, కరుణ, ధార్మిక చింతన, సోదర భావం, శాంతి, సామరస్యాలను బోధించిన గొప్ప తత్వవేత్త మహ్మద్ ప్రవక్త అని గూడూరు ఆర్డీఓ ఆదినారాయణ రావు అన్నారు. మహ్మద్ ప్రవక్త పుట్టిన రోజు సందర్భంగా గూడూరులోని షాదీ మంజిల్‌లో గురువారం మహ్మదీయన్ వెల్ఫేర్ నెట్‌వర్క్ ఆధ్వర్యంలో మిలాడినబీ వేడుకలను ఘనంగా నిర్వహించారు. అనంతరం పట్టణంలోని పాఠశాలల్లో పదో తరగతి చదువుతున్న 100 మంది ముస్లిం విద్యార్థినులకు 2 జతల దుస్తులు, పేద మహిళలకు చీరలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మహ్మదీయన్ వెల్ఫేర్ నెట్‌వర్క్ గౌరవాధ్యక్షులు షేక్ రియాజ్ అహ్మద్, అబ్దుల్ రహీం, షేక్ మహబూబ్‌బాషా, కార్యదర్శి షానవాజ్, ఎంఈఓ ఎండీ రవూఫ్, దర్గా కమిటీ అధ్యక్షుడు రియాజ్ అహ్మద్, వక్ఫ్‌బోర్డు జిల్లా ఉపాధ్యక్షుడు గఫూర్, అజీజ్‌ఖాన్, కాలేషా, గోల్డ్ నాజర్ పాల్గొన్నారు. అలాగే జామియా మసీదు వద్ద మైనార్టీ నాయకులు జిలానీబాషా, అహ్మద్‌బాషా ఆధ్వర్యంలో అన్నదానం చేశారు.

ఘనంగా సుబ్రమణ్యేశ్వరస్వామి గ్రామోత్సవం



సుబ్రమణ్యేశ్వరస్వామి ఊరేగింపు

చిట్టమూరు మల్లాం గ్రామంలోని శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రమణ్యేశ్వరస్వామి ఆలయంలో జరుగుతున్న స్వామివారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం స్వామివారి గ్రామోత్సవం వైభవంగా నిర్వహించారు. ఉదయం మూలవిరాట్‌కు అభిషేకాలు, నిత్యకైంకర్యాలు జరిపారు. అనంతరం స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులకు సుగంధభరిత పుష్పాలతో విశేషాలంకరణ చేసి, గ్రామోత్సవం చేశారు. గ్రామస్తులు కొబ్బరి కాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా శోభాయమానంగా తీర్చిదిద్దిన విద్యుదీపాలంకరణ భక్తులను ఆకట్టుకుంది. శుక్రవారం స్వామివారికి ఫలాభిషేకం, నందిసేవ, మల్లాసుర, కొల్లాసుర యుద్ధం తదితర కార్యక్రమాలు జరుగుతాయని ఆలయ ట్రస్టు బోర్డు చైర్మన్ సాయికుమార్‌రెడ్డి తెలిపారు.

ఉత్సాహంగా స్మార్ట్ ఇండియా హ్యాకథాన్



ఆదిశంకర కళాశాలలో ఏర్పాటు చేసిన హ్యాకథాన్-2023లో పాల్గొన్న విద్యార్థులు

గూడూరురూరల్: పట్టణ సమీపంలోని ఆదిశంకర ఇంజినీరింగ్ కళాశాలలో గురువారం నిర్వహించిన స్మార్ట్ ఇండియా హ్యాకథాన్–2023 కార్యక్రమంలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని విజయవంతం చేశారని ఆ కళాశాల డైరెక్టర్ విజయకుమార్ తెలిపారు. భారత ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా ఆల్ ఇండియా టెక్నికల్ ఎడ్యుకేషన్ ఆఫ్ న్యూఢిల్లీ వారి ఆధ్వర్యంలో చేపట్టిన స్మార్ట్ ఇండియా హ్యాకథాన్–2023 కార్యక్రమాన్ని కళాశాలలో రెండు రోజులపాటు నిరవధికంగా నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థుల నుంచి 35 ఉపాయాలను సేకరించి, కేంద్ర ప్రభుత్వానికి అందజేస్తామన్నారు. తద్వారా దేశ, రాష్ట్రాల్లో ఉన్న వ్యవస్థల్లో ఉన్న సమస్యలను పరిష్కరించేందుకు ఈ హ్యాకథాన్ కార్యక్రమం ఉపయోగపడుతుందని తెలిపారు.

త్వరలో విగ్రహాలు ప్రారంభం



టవర్‌క్లాక్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే తనయుడు నవీన్‌గుప్త

గూడూరురూరల్: పట్టణంలో తమ సొంత నిధులతో ఏర్పాటు చేసిన టవర్‌క్లాక్, మహనీయుల విగ్రహాలను ఏర్పాటు చేసినట్లు ఎమ్మెల్యే వరప్రసాద్‌రావు తనయుడు నవీన్‌గుప్త తెలిపారు. గురువారం గూడూరు పట్టణంలో నిర్మాణం పూర్తయిన టవర్‌క్లాక్, మహాత్మాజ్యోతిరావ్‌పూలే, సావిత్రీబాయిపూలే, జగజ్జీవన్‌రామ్, అబుల్‌కలాం ఆజాద్, మదర్ థెరిస్సా విగ్రహాలను స్థానిక నాయకులతో కలసి పరిశీలించారు. 90 శాతం నిర్మాణాలు పూర్తయ్యాయిని, త్వరలో వీటిని ప్రారంభించి గూడూరు ప్రజలకు అంకితం చేస్తామన్నారు.

ఆటోబోల్తా



దెబ్బతిన్న ఆటో

దొరవారిసత్రం: ముందు వెళుతున్న లారీని అధిగమించే క్రమంలో లారీ వెనుక భాగంలోని గొలుసులు తగులుకోవడంతో ఓ ఆటో బోల్తా పడి, నుజ్జునుజ్జు అయిన ఘటన గురువారం కలుగుంట సమీపంలో చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. కొత్తపల్లెకు చెందిన ఆటో నాయుడుపేటకు వెళ్లి సిమెంట్ బస్తాలు వేసుకుని తిరిగి కొత్తపల్లెకు బయలు దేరింది. ఈ క్రమంలో కలగుంట సమీపంలో జాతీయరహదారి మరమ్మతులు జరుగుతుండడంతో వాహన రాకపోకలు ఒకేవైపు అనుమతిస్తున్నారు. ఈ క్రమంలో ముందు వెళుతున్న లారీని అధిగమించే ప్రయత్నంలో ఆటోకు లారీ వెనుకన ఉన్న గొలుసులు తగులుకున్నాయి. దీంతో ఆటో బోల్తా పడింది. ఆ సమయంలో ఆటోలో ఉన్న డ్రైవర్ పీరయ్యతోపాటు ముగ్గురు ప్రయాణికులు సురక్షితంగా బయటపడ్డారు. ఈ ప్రమాదంపై స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఎలాంటి ఫిర్యాదు అందలేదు.

భక్తిశ్రద్ధలతో మిలాద్ ఉన్ నబీ

నాయుడుపేటటౌన్: ముస్లింలు మిలాద్ ఉన్ నబీ పండుగను గురువారం రాత్రి భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. పలు మసీదుల్లో ప్రత్యేక నమాజు చేశారు. పట్టణంలోని జామీయ మసిదు, పెద్ద దర్గాలోని అమీర్‌షావలి మసీదు, పాత బస్టాండు వద్ద ఉన్న నూర్ మసీదు, అమరాగార్డెన్‌లోని మక్కా మసీదు, ఎల్‌ఏ సాగరం కొత్త, పాత బీడీకాలనీలోని మసీదు, మునిరత్నంనగర్, పాగొట్టం కాలనీల్లో మసీదుల వద్ద అనేక మంది ముస్లిం రాత్రంతా జాగారం చేస్తూ ప్రత్యేక నమాజు చేశారు.

ఉచిత వైద్యశిబిరానికి విశేషస్పందన

వెంకటగిరిరూరల్: మండలంలోని కె ఉప్పరపల్లెలో గురువారం నిర్వహించిన ఉచిత వైద్యశిబిరానికి విశేషస్పందన లభించింది. శ్రీనివాసన్ సర్వీసు ట్రస్టు, శ్రీవేంకటేశ్వర ఇనిస్టిట్యూట్ ఆఫ్ క్యాన్సర్ కేర్ అండ్ అడ్వాన్స్ డ్ రీసెర్చ్ సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన ఈ శిబిరంలో సుమారు 120 మందికి పరీక్షలు చేసి, మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రామ్ మేనేజర్ హేమంత్‌కుమార్, కార్యక్రమ సమన్వయకర్త రెడ్డికుమారి, సిబ్బంది మొహతాజ్, అమరావతి, చైతన్య, శ్రీనివాస సేవా ట్రస్టు నిర్వాహకులు సతీష్‌కుమార్, కేశవ, అలేఖ్య, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

నేడు నూతన భవనాలు ప్రారంభం

చిల్లకూరు: మండలంలోని తూర్పుకనుపూరులో నూతనంగా నిర్మించిన మూడు భవనాలను శుక్రవారం ఎమ్మెల్యే వెలగపల్లి వరప్రసాద్‌రావు ప్రారంభించనున్నట్లు ఎంపీడీఓ నిర్మలాదేవి తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ఆమె మాట్లాడుతూ రూ.40 లక్షల వ్యయంతో నిర్మించిన సచివాలయం, రూ.21.80 లక్షలతో నిర్మించిన హెల్త్ క్లినిక్, రూ.17.50 లక్షలతో నిర్మించిన ఆర్బీకే భవనాలను ఎమ్మెల్యే ప్రారంభిస్తారన్నారు. సర్పంచ్ ఏ నాగమ్మ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమాల్లో అందరూ పాల్గొని, విజయవంతం చేయాలన్నారు.

కండలేరులో 11.861 టీఎంసీలు

రాపూరు: కండలేరు జలాశయంలో గురువారం నాటికి 11.861 టీఎంసీ నీరు నిల్వ ఉన్నట్లు జలాశయం ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. హెడ్‌రెగ్యులేటర్ నుంచి సత్యసాయి గంగ కాలువకు 605 క్యూసెక్కులు, పిన్నేరువాగుకు 10, మొదటి బ్రాంచ్ కెనాల్‌కు 5, లోలెవల్ స్లూయిస్‌కు 30 క్యూసెక్కుల వంతున విడుదల చేస్తున్నట్లు పేర్కొన్నారు.

బ్రహ్మోత్సవాలకు రండి



అంజూరు తారక శ్రీనివాసులను ఆహ్వానిస్తున్న సాయికుమార్‌రెడ్డి

శ్రీకాళహస్తి: తిరుపతి జిల్లాలోని చిట్టమూరు మండలం మల్లాం గ్రామంలో ఉన్న శ్రీవల్లీ దేవసేన సమేత స్వయంభు సుబ్రహ్మణ్యేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలకు రావాలని శ్రీకాళహస్తీశ్వరాలయ పాలక మండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులను ఆ ఆలయ చైర్మన్ సాయికుమార్‌రెడ్డి గురువారం ఆహ్వానించారు. దీనిపై స్పందించిన అంజూరు శ్రీనివాసులు మాట్లాడుతూ శ్రీకాళహస్తీశ్వరాలయం తరపున పట్టువస్త్రాలు సమర్పిస్తామని తెలిపారు.

సవరణలు సరికాదు

గూడూరురూరల్: అసైన్‌మెంట్ చట్ట సవరణ సరికాదని, పేద, బడుగు బలహీనవర్గాలు తీవ్రంగా నష్టపోతాయని అఖిల భారత రైతు కూలీ సంఘం జిల్లా కన్వీనర్ పోలయ్య అన్నారు. గూడూరులోని విశ్రాంత ఉద్యోగుల భవనంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నాయకులు సీఎస్.సాగర్, ఐఎఫ్‌టీయూ నేత కె.రమేష్, నవకోటిపాల్గొన్నారు.

వేడుకగా సహస్ర సిద్ధి గణపతి హోమం



విశేషాలంకరణలో సహస్ర సిద్ధి గణపతి

ఏర్పేడు: మండలంలోని మర్రిమంద బీసీ కాలనీలో గురువారం సహస్ర సిద్ధి గణపతి హోమం, పూజలు వేడుకగా జరిగాయి. ఆలయాన్ని నూతనంగా నిర్మించి 11 రోజుల పాటు వివిధ రకాల అభిషేకాలతో విశేషాలంకరణ చేసి పూజలు చేశారు. చివరి రోజు గురువారం 1008 లడ్డూలతో గణపతికి అభిషేకం, హోమం, విశేష పూజలు నిర్వహించారు. స్వామివారిని పుర వీధుల్లో ఊరేగించారు. గ్రామస్తులు స్వామివారికి పూజలు చేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీలు నాగరాజురెడ్డి, మునిరాజా, నాయకులు హేమాద్రి, త్రివిక్రమరావు, గురవారెడ్డి, లోకేష్, సుబ్రమణ్యంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అందరి ఆరోగ్యమే లక్ష్యం



చిల్లకూరు: ఉదతావారిపాలెంలో వైద్య పరీక్షలు చేస్తున్న సిబ్బంది

చిల్లకూరు: పేదలందరి ఆరోగ్యమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం అమలు చేసిందని, తద్వారా ప్రజలకు రక్షణ కలుగుతుందని వల్లిపేడు వైద్యాధికారి ప్రసన్నరాణి అన్నారు. మండలంలోని వల్లిపేడు పీహెచ్‌సీ పరిధిలోని ఉడతావారిపాలెంలో గురువారం వైద్యసిబ్బంది ఇంటింటికీ వెళ్లి, పరీక్షలు చేసి అవసరమైన వారికి టోకెన్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం కింద ప్రతి ఒక్కరికీ బీపీ, మధుమేహంతోపాటు ఇతర వ్యాధులు ఏమైనా ఉన్నాయనే విషయాన్ని వైద్యసిబ్బంది గుర్తించి టోకెన్లు అందిస్తారని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఏఎన్‌ఎం వరలక్ష్మి, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

త్వరలో గ్రామాల్లో వైద్యసేవలు

దక్కిలి: గ్రామాల్లో త్వరలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా వైద్యసేవలు అందిస్తారని ఏఎన్‌ఎం రేఖ తెలిపారు. మండలంలోని లింగసముద్రం, నాయుడుపాళెం, చాకలపల్లె తదితర గ్రామాల్లో గురువారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఏఎన్‌ఎం, ఆశ వర్కర్స్ ఇంటింటికి వెళ్లి బీపీ, షుగర్, దీర్ఘ కాలిక వ్యాధులున్న వారి గుర్తించి, టోకెన్లు అందజేశారు.

ఆరోగ్య సురక్ష ఓ వరం

సైదాపురం: జగనన్న ఆరోగ్య సురక్ష రోగుల పాలిట వరమని ఎంపీడీఓ వెంకటేశ్వర్లు తెలిపారు. మండలంలోని రామసాగరం సచివాలయం పరిధిలో గురువారం జగనన్న ఆరోగ్య సురక్ష సర్వేని ఆయన పరిశీలించారు. వైద్యసిబ్బందితో కలిసి ఇంటింటికీ వెళ్లి అనారోగ్యంతో బాధపడుతున్న వారిని ఎలా గుర్తించాలనే విషయాలపై ఆరా తీశారు. అనంతరం సిబ్బందితో ప్రత్యేకంగా సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని అమలు చేస్తుందన్నారు. ప్రతి ఇంటికి వెళ్లి వారి వివరాలను పక్కాగా గుర్తించి, వివరాలను నమోదు చేయాలని ఆదేశించారు. 30వ తేదీన గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఆయన వెంట వైద్యులు డాక్టర్ జనార్ధన్, ఏఓ పురుషోత్తం శివకుమార్ తదితరులున్నారు.

ఇంటింటా సర్వే..

జగనన్నఆరోగ్య సురక్షపై మండలంలోని చీకవోలు, గంగదేవిపల్లె, అనంతమడుగు, కొమ్మిపాడులో గ్రామాల్లో గురువారం వైద్య సిబ్బంది సర్వే చేపట్టారు. వైద్యులు డాక్టర్ జనార్ధన్, డాక్టర్ శ్రావణి మాట్లాడుతూ రోగుల పాలిట వరమని అన్నారు. జగనన్న ఆరోగ్య సురక్షలో భాగంగా ఇంటింటిని సందర్శించి అనారోగ్యంతో బాధపడుతున్న వారిని గుర్తించి యాప్‌లో నమోదు చే స్తున్నామన్నారు.

ముమ్మరంగా సర్వే

రాపూరు: మండలంలోని పలు గ్రామాల్లో జగనన్న ఆరోగ్య సురక్ష సర్వే ముమ్మరంగా జరుగుతుందని వేపినాపి పీహెచ్‌సీ వైద్యులు సూర్యధర్మేంద్ర తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో వలంటీర్లు, వైద్యసిబ్బంది ఇంటింటికీ వెళ్లి ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. చిన్నారులు, పెద్దలకు పరీక్షలు నిర్వహించి ఆన్‌లైన్‌లో నమోదు చేస్తామన్నారు. రాపూరులో 8 బృందాలు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నారని, పట్టణంలో 3,061 గృహలకు గాను 1,050 గృహాల్లో వైద్యపరీక్షలు పూర్తి చేశామన్నారు. వైద్యసిబ్బంది లింగమూర్తి, కాంతమ్మ తదితరులు పాల్గొన్నారు.



గూడూరురూరల్: అయ్యవారిపాలెంలో సర్వే చేస్తున్న వైద్య సిబ్బంది

అందరికీ ఆరోగ్యం

పెళ్లకూరు: జగనన్న సురక్ష పథకం ద్వారా ఇంటింటా సర్వే చేపట్టి మెరుగైన వైద్య సేవలు అందించడంతో అందరికీ ఆరోగ్యం చేకూరుతుందని ఎంపీపీ శేఖర్‌రెడ్డి అన్నారు. గురువారం జీలపాటూరులో జరుగుతున్న సురక్ష కార్యక్రమం పనితీరును ఎంపీటీసీ సభ్యులతో కలిసి పరిశీలించారు. అందరికీ మెరుగైన వైద్యం అందించి ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా జీవించాలన్న లక్ష్యంతో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఈ కార్యక్రమాన్ని అమలు చేశారన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు కుమారస్వామి, వైఎస్సార్ సీపీ నాయకులు మోహన్, జితేంద్ర, అశోక్, కృష్ణయ్య, గోపాలయ్య తదితరులు పాల్గొన్నారు.

చురుగ్గా సర్వే

గూడూరురూరల్: జగనన్న ఆరోగ్య సురక్షలో భాగంగా గూడూరు మండలంలో వైద్య సిబ్బంది ఇంటింటి సర్వే ముమ్మరంగా నిర్వహిస్తున్నారు. గురువారం మండలంలోని తిప్పవరప్పాడులో ఏఎన్‌ఎం విజయలక్ష్మి, ఆశా కార్యకర్తలు ఇంటింటికి వెళ్లి ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. అలాగే అయ్యవారిపాళెంలో ఏఎన్‌ఎం కుమారి, ఆశా కార్యకర్తలు ఇంటింటి సర్వే చేపట్టి ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహించారు.



దక్కిలి: దిగువ లింగసముద్రంలో..



రాపూరులో జగనన్న ఆరోగ్య సురక్ష సర్వే చేస్తున్న వైద్యసిబ్బంది



సైదాపురం: మహిళకు బీపీ చూస్తున్న వైద్యసిబ్బంది



పెళ్లకూరు: జగనన్న సురక్ష కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న ఎంపీపీ శేఖర్‌రెడ్డి